న్యూస్‌రీల్

పీసీ రాయులుకు ఎక్స్‌లెన్సీ అవార్డు



యునైటెడ్ నేషన్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకుంటున్న డాక్టర్ పీసీ రాయులు

తిరుపతి కల్చరల్: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయులకు యునైటెడ్ నేషన్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు లభించింది. ఈమేరకు టర్కీ కన్సల్టెంట్ సహకారంతో ఐక్యరాజ్య సమితి గ్లోబల్ పీస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. యూఎస్‌ఏ, టర్కీ, యూకె, యూఏఈ, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ వంటి దేశాల దౌత్యవేత్తల సమక్షంలో ఈ అవార్డు అందుకున్న ఆయనను పలువురు అభినందించారు.

ఇంటర్ పరీక్షలకు 798 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మ్యాథ్స్–2ఎ, బోటనీ, సివిక్స్ సబ్జెక్టుల్లో పరీక్ష జరిగింది. తిరుపతి జిల్లావ్యాప్తంగా 87 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు జనరల్‌లో 27,771 మంది, ఒకేషనల్‌లో 1,144 మంది, మొత్తం 28,915 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. అయితే జనరల్‌లో 718 మంది, ఒకేషనల్‌లో 80 మంది మొత్తం 798 మంది గైర్హాజరవడంతో 28,117 మంది పరీక్షకు హాజరైనట్లు ఇంటర్ ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా ఈ నెల 9వ తేదీ శనివారం 87 పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు మ్యాథ్స్–1బి, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగుతాయని ఆర్ఐఓ పేర్కొన్నారు.

రూ.కోటి విరాళం



ఈఓ ధర్మారెడ్డికి విరాళం డీడీని అందజేస్తున్న దాతలు శేష మస్తాన్‌రావు, కుంకుమరేఖ

తిరుమల : టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు విశాఖపట్నంకు చెందిన హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పువ్వాడ శేష మస్తాన్‌రావు, కుంకుమరేఖ దంపతులు రూ.కోటి విరాళం అందజేశారు. ఈమేరకు గురువారం టీటీడీ జేఈఓ బంగ్లాలో ఈఓ ఏవీ ధర్మారెడ్డిని కలిసి విరాళం డీడీని అందించారు.

ఎన్నికల సామగ్రికి టెండర్లు

తిరుపతి అర్బన్: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నిర్వహణకు అవసరమైన సామగ్రితో పాటు వీడియోగ్రాఫర్ల నుంచి టెండర్లు స్వీకరించడానికి దరఖాస్తులను కోరుతున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 30–45 రోజులు పనిచేయడానికి 2,138 మంది వీడియో గ్రాఫర్లను తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈనెల11వ తేదీ వరకు దరఖాస్తులను కలెక్టర్ కార్యాలయం వద్ద ఇవ్వాలని కోరారు. అదనపు సమాచారం కోసం 6281157783 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. మరోవైపు కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, పోలీస్ సిబ్బంది నియామకపు ఉత్తర్వుల విభాగాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, స్టేషనరీ తదితర వస్తువులను సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్ చేయడానికి ఆసక్తి కలిగిన ప్రింటింగ్ ప్రెస్‌వారి నుంచి ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని వెల్లడించారు.



విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

విశ్వ గురువు భారత్

"భారతదేశం విద్యారంగంలో విశ్వగురువుగా అవతరిస్తోంది.. దేశం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రతి మహిళా విద్యావంతురాలు కావాలి.. అప్పుడే భవిష్యత్ తరాలకు దిక్సూచిగా నిలుస్తారు.. మహిళా వర్సిటీలో నాణ్యమైన విద్య, ఉపాధి కల్పన దిశగా చర్యలు చేపట్టడం శుభ పరిణామం.." అని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగిన 21వ స్నాతకోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు.

- మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి
- నాణ్యమైన విద్య, ఉపాధి కల్పన దిశగా మహిళా వర్సిటీ
- గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్
- గౌరవ డాక్టరేట్ అందుకున్న ప్రముఖ గాయని పి.సుశీల
- 57 మందికి గోల్డ్‌మెడల్స్, 1548 మందికి పీజీ, యూజీ, పీహెచ్‌డీ పట్టాలు

తిరుపతి సిటీ : విద్యారంగంలో విప్లవాత్మక మార్పులతో విశ్వ గురువుగా భారత్ నిలుస్తోందని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. గురువారం తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగిన 21వ స్నాతకోత్సవానికి ఆయన చాన్సలర్ హోదాలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో విద్యావ్యవస్థలో భారత్ రెండోస్థానంలో ఉందని, త్వరలో మొదటి స్థానం కైవసం చేసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ప్రతి మహిళా విద్యావంతురాలైతేనే భవిష్యత్ తరాలకు దిక్సూచిగా నిలిస్తుందని సూచించారు. పురుషులతో సమానంగా విద్య, ఆర్థిక, సామాజిక రంగాలలో మహిళలు రాణించి సమాజ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధి, ఉద్యోగ కల్పనతో పాటు మహిళల జీవన ప్రమాణ స్థాయి పెరిగే విధంగా కేంద్రప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

పద్మభూషణ్ సుశీలకు గౌరవ డాక్టరేట్..

ప్రపంచవ్యాప్తంగా సుమారు 17,965 సినీ గీతాలు ఆలపించిన ప్రముఖ గాయని, పద్మభూషణ్ అవార్డు గ్రహీత పి.సుశీలకు గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత నెలకొన్న మహిళా వర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోవడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు.

ఈశ్వరమ్మకు డాక్టరేట్..

పద్మావతి వర్సిటీలో తిరుపతి సమాచార శాఖలో డీపీఆర్‌ఓగా పనిచేస్తున్న కే.ఈశ్వరమ్మ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో డాక్టరేట్ పట్టాను గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆమెతో పాటు మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విభాగానికి చెందిన ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ పి.కౌసల్య డాక్టరేట్ పట్టా అందుకున్న వారిలో ఉన్నారు.

మహిళలకు ప్రాతినిధ్యంలో ముందంజ..

మహిళా వర్సిటీ నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించి దేశంలోని అత్యున్నత వర్సిటీల్లో 16వ స్థానంలో నిలవడం గొప్ప విషయమని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. డిగ్రీ పట్టాలు సాధించిన విద్యార్థినులు భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదిగి దేశ సేవలో కొనసాగాలన్నారు. ఉన్నత విద్యపై అఖిల భారత సర్వే నివేదిక ప్రకారం ఉన్నత విద్యలో 2014–15లో మహిళల నమోదు 45 శాతం ఉండగా, 2020–21 నాటికి 49 శాతానికి పెరిగిందని తెలిపారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్న భారత్ అమృత్ కాల్‌లో భాగంగా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు పొందుతోందన్నారు.



స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థినులు

57 మందికి గోల్డ్‌మెడల్స్

వర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా పలు విభాగాలకు చెందిన 57 మంది విద్యార్థినులకు గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. అలాగే 12 మందికి బుక్ ప్రైజ్‌లు, నలుగురికి నగదు బహుమతులు అందజేశారు. దీంతో పాటు 87 పీహెచ్‌డీ పట్టాలు, 1,461 పీజీ, యూజీ పట్టాలను అందజేశారు. గోల్డ్‌మెడల్ అందుకున్న వారిలో భావ్యశ్రీ, షేక్ జరీనాబేగ్, జ్యోతి, దీప్తి, హీనా బేగం తదితరులు ఉన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లండి..



మాట్లాడుతున్న ఇస్రో మాజీ సైంటిస్ట్ మణి

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇస్రో మాజీ సైంటిస్ట్ మంగళ మణి మాట్లాడుతూ మహిళలు ఆత్మస్థైర్యంతో ఏదైనా సాధించగలరని, ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకుని ప్రతి మహిళా లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం వీసీ డి.భారతి మాట్లాడుతూ కేంద్ర పీఎం–ఉషా పథకం కింద రూ.100 కోట్లు వర్సిటీకి కేటాయించడం హర్షణీయమన్నారు.

శ్రీకాళహస్తిలో నేడు ట్రాఫిక్ మళ్లింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం శుక్రవారం ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు.

1.తిరుపతి, నెల్లూరు వైపు నుంచి వచ్చే భక్తులు వారి కార్లను, బస్సులను పొన్నాలమ్మ గుడి వద్ద గల మార్కెట్ యార్డులో పార్కింగ్ చేసుకోవాలన్నారు.

2. ద్విచక్ర వాహనాలు రివర్ వ్యూ రిసార్ట్‌కు ఎదురుగా వెళ్లే నది ఒడ్డున ఉన్న మట్టిదారిలో పార్కింగ్ చేసుకోవాలి.

3. చెన్నై, పిచ్చాటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ మీదుగా వెళ్లి, హైవే ఎక్కి ఏపీ సీడ్స్ మీదుగా మార్కెట్‌యార్డు రావాలి.

4. పార్కింగ్ ప్రదేశాల నుంచి ఉచిత బస్సు సౌకర్యం కలదు. ఉచిత బస్సులు 10 నిమిషాలకు ఒకటి అందుబాటులో ఉంటుంది. ఉచిత బస్సు ఎక్కిన వారు సాంస్కృతిక కార్యక్రమాల వేదిక పక్కన నిర్మించిన 4 వరుసల రోడ్డు వద్దకు వచ్చి గుడికి క్యూలైన్ సమీపంలో దిగుతారు. దర్శనం అనంతరం అక్కడే ఉచిత బస్సు ఎక్కుతారు.

5. ఉచిత బస్సులు రైల్వేస్టేషన్, ఏపీసీడ్స్ నుంచి మార్కెట్‌యార్డు నుంచి ఏపీఎస్ ఆర్టీసీ నుంచి వీఎంసీ సర్కిల్ నుంచి అందుబాటులో ఉంటాయి. మాడవీ ధుల్లో స్వామి, అమ్మవారి ఊరేగింపు సమయంలో ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండు నుంచి వీఎంసీ సర్కిల్ నుంచి వచ్చే ఉచిత బస్సులను కాసేపు నిలుపుతారు.

6. ఆటోలు కూడా పొన్నాలమ్మ గుడి, వెంకటగిరి బస్టాండు వరకు మాత్రమే తిప్పాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 06 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,887 మంది స్వామివారిని దర్శించుకోగా 23,532 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో రూ.3.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, లేనివారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు ఉన్న వారికి 2 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.

తిరుపతిలో ఆరణి మంటలు



తిరుపతి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులకు 'ఆరణి' మంటలు రేగాయి. తిరుపతి టికెట్ ఆశించిన ఆ పార్టీ నేతల ఆశలపై చంద్రబాబు నీళ్లు చల్లారు. పొత్తుల్లో భాగంగా చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కేటాయించే యోచనలో ఉన్నట్టు సంకేతాలు రావడంతో ఇరు పార్టీల నేతలు అధినాయకత్వంపై నిప్పులు చెరుగుతున్నారు.

- పొత్తుల్లో భాగంగా జనసేనకే తిరుపతి
- టీడీపీ నేతలకు తేల్చిచెప్పిన అచ్చెన్నాయుడు
- స్థానిక జన సైనికులకు మొండిచేయి
- ఆరణి శ్రీనివాసులు వైపే పవన్ మొగ్గు
- జనసేనలో చేరి టికెట్ తెచ్చుకోవాలనే యోచనలో 'దేశం' నేతలు

సాక్షి, తిరుపతి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి టీడీపీ నేతలకు షాక్ ఇచ్చారు. పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించినట్లు ఆ పార్టీ స్థానిక నేతలకు తేల్చి చెప్పేశారు. ఇన్నాళ్లు పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేసినందుకు అధినేత చంద్రబాబు పెద్ద బహుమానమే ఇచ్చారని ఆ పార్టీ తిరుపతి నేతలు మండిపడుతున్నారు. టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నప్పటి నుంచి జనసేన నాయకులు తిరుపతి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. నాడు చిరంజీవి తిరుపతి నుంచి పోటీ చేసి గెలుపొందారనే కారణంతో జనసేన శ్రేణులు ఆశలు పెట్టుకున్నాయి. అందులో భాగంగానే పవన్ కల్యాణ్ తిరుపతి స్థానం తమ పార్టీకే కేటాయించాలని చంద్రబాబుని కోరినట్లు తెలిసింది. అయితే చంద్రబాబు ఎటూ తేల్చకుండా నాన్చుతూ వచ్చారు.

ఎట్టకేలకు తేల్చారు..

ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా తిరుపతి సీటును తేల్చేశారు. జనసేనకు కేటాయించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా గురువారం తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, జేబీ శ్రీనివాసులుకు చంద్రబాబు కబురు చేశారు. టీడీపీ కార్యాలయం నుంచి పిలుపు అందుకున్న తిరుపతి నాయకులు హడావుడిగా గురువారం అమరావతికి చేరుకున్నారు. తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించినట్లు తేల్చిచెప్పారు. అందరూ కలిసి పనిచేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో వారికి చెప్పించారు.

జనసేనలో చేరేందుకు యత్నాలు..

తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించడంతో టీడీపీలోని ఆశావాహులు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్, వూకా విజయ్ కుమార్, జేబీ శ్రీనివాసులు ఎవరికి వారు జనసేన కండువా కప్పుకుని టికెట్ దక్కించుకోవాలని గురువారం అమరావతిలోనే తిష్ట వేశారు.

ఆరణి వైపు పవన్ మొగ్గు ..

చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును జనసేన అభ్యర్థిగా తిరుపతి నుంచి బరిలో దింపాలని పవన్‌కల్యాణ్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. పవన్ హామీ మేరకే ఆయన జనసేనలో చేరినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పార్టీ పెట్టినప్పుడు నుంచి జెండా మోస్తున్న తమకు కాదని నిన్న పార్టీలో చేరిన వేరే ప్రాంతం వ్యక్తికి ఇక్కడ ఎలా టికెట్ ఇస్తారని జనసేన నాయకులు డాక్టర్ హరిప్రసాద్, కిరణ్ రాయల్ ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది.

హరహర మహాదేవ

- మూగజీవుల ముక్తిక్షేత్రంలో నేడు జంగమయ్య జాతర
- మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి



పురవీధుల్లో విహరిస్తున్న ఆదిదంపతులు



విద్యుత్ దీప వెలుగుల్లో కాంతులీనుతున్న శ్రీకాళహస్తి ఆలయం

రేణిగుంట/శ్రీకాళహస్తి: మూగజీవుల ముక్తిక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం మహాశివరాత్రి సంబరానికి కోటికాంతులు విరజిమ్ముతూ ముస్తాబైంది. ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాల వెలుగులతో పండుగ కళ నెలకొంది. ఆలయం లోపల ఇతర ప్రాంతాల నుంచి తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శివరాత్రి సందర్భంగా సుమారు 3లక్షల మంది భక్తులు శ్రీకాళహస్తి క్షేత్రానికి రానున్నట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఈఓ నాగేశ్వరరావు, ఆలయాధికారులు మునుపెన్నడూ లేని రీతిలో మహాశివరాత్రి ఉత్సవాలను జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పట్టు వస్త్రాలను సమర్పించిన డిప్యూటీ సీఎం..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దంపతులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. పట్టువస్త్రాలను తీసుకువచ్చిన మంత్రి దంపతులకు ఆలయం తరపున ఘనంగా ఆలయ సంప్రదాయాలతో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఈఓ ఎస్వీ నాగేశ్వరావు, మాజీ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఘనంగా స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య పట్టువస్త్రాలను జ్ఞానప్రసూనాంబిక అతిథిగృహం వద్ద నుంచి ఆలయం లోపలకు తీసుకువచ్చారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల వద్ద పట్టువస్త్రాలను ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ఈఓ నాగేశ్వరావుకు లాంఛనంగా అందజేశారు.

శోభాయమానంగా బ్రహ్మోత్సవాలు

కాగా బహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరస్వామి బంగారు హంస వాహనంపై, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు శుక వాహనంపై, రాత్రి స్వామివారు శేషవాహనం, అమ్మవారు యాళివాహనంపై పురవీధుల్లో ఊరేగారు.



శేష, యాళి వాహనాలపై స్వామి, అమ్మవార్లు



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం

- ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ రావచ్చు
- వచ్చిన వెంటనే ఎన్నికల కోడ్ రూల్స్ పాటించండి
- ప్రశాంతమైన ఎన్నికలకు మీడియా సహకారం తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.లక్ష్మీశ

తిరుపతి అర్బన్: వచ్చే సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్ర కీలకంగా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సార్వత్రిక ఎన్నికలు–2024 నిర్వహణపై ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కలెక్టర్ నేతృత్వంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో మీడియా పాత్ర అత్యంత కీలకమైందన్నారు. కోడ్ ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉందని, రానున్న సాధారణ, పార్లమెంట్ ఎన్నికల్లో పాత్రికేయులు ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడంలో ముఖ్యపాత్ర పోషించాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలను పాటించేలా మీడియా ప్రధాన భూమిక వహించాలని వెల్లడించారు. ఓటర్లకు అవసరమైన సమాచారం తెలియజేయడంలో మీడియా ప్రధానంగా వ్యవహరించాలని చెప్పారు. ఎన్నికల్లో మీడియా పాత్రపై అన్ని రకాల అంశాలను తెలియజేయడం కోసం శిక్షణ కార్యక్రమం నిర్వహిచామని చెప్పారు. ముఖ్యంగా పెయిడ్ న్యూస్‌కి సంబంధించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, సూచనలు ఉన్నాయని, ఇందుకోసం ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ) ఉంటుందని తెలిపారు. డీపీఆర్ రేట్స్ ప్రకారం పెయిడ్ న్యూస్ లెక్కించబడుతుందని తెలిపారు. ఎన్నికల వేళ రానున్న రోజుల్లో మీడియా అవసరమైన సహాయ, సహకారాలు అందించాలని కోరారు. సోషల్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఏ చిన్న విషయమైనా ఓటర్లకు వెంటనే చేరువ అవుతుందని, ఎన్నికల్లో ఓటర్లను చైతన్యపరచడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఎన్నికల్లో ప్రజలు పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలని సూచించారు. ఏదైనా వార్తను ప్రచురించే ముందు ఫ్యాక్ట్ చెక్ సరిచూసుకుని ప్రచురించాలని చెప్పారు. ఏ ప్రకటన అయినా సరే ముందుగా ఎంసీఎంసీ ద్వారా సర్టిఫై అయిన తర్వాతే ప్రచురించాలన్నారు. ఈ సందర్భంగా అన్ని రకాల అంశాలపై ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఅండ్‌పీఆర్ డివిజనల్ అధికారి ఈశ్వరమ్మ, సిబ్బంది, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రాం ఆఫీసర్ సుధా మోహన్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి మెట్ల మార్గంలో భక్తుడు మృతి

తిరుమల : శ్రీవారి దర్శనార్థం శ్రీవారి మెట్టుమార్గంలో వెళ్తున్న ఓ భక్తుడు గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెంకు చెందిన ఉప్పాడ సతీష్(50) కుటుంబసభ్యులతో కలిసి తిరుపతికి చేరుకున్నారు. అనంతరం శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారి మెట్టుమార్గంలో కాలినడకన తిరుమలకు బయలుదేరారు. మార్గమధ్యలో ఆకస్మాత్తుగా కుప్పకూలడంతో కుటుంబసభ్యులు తిరుమల అశ్విని ఆస్పత్రి తరలించా రు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల అభ్యర్థన మేరకు మృతదేహాన్ని టీటీడీ అంబులెన్స్‌లో వైజాగ్ తరలించారు.

మానవ నాగరికతకు మూలం మహిళ

- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి
- వేడుకగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- 20 మందికి పద్మావతి అవార్డులు ప్రదానం


పద్మావతి అవార్డుతో మహిళను సత్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: మానవ నాగరికతకు మూలం మహిళ అని టీటీటీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణాల ప్రకారం ఆది దేవత మహిళ అన్నారు. చాలా గ్రామాల్లో గ్రామదేవతలు మహిళలని తెలిపారు. చరిత్రలో చాలా మంది రాణులు చక్కటి రాజ్యపాలన చేశారని, ఆధునిక కాలంలో సిరిమావో బండారు నాయకే, ఇందిరాగాంధీ, మార్గరెట్ థాచర్ వంటి మహిళామణులు దేశ ప్రధానులుగా తమదైన ముద్ర వేశారన్నారు. వర్తమాన సమాజంలో మహిళలు ఆయా రంగాల్లో ఎంతో ప్రావీణ్యం సంపాదించి ముందుకు వెళుతున్నారన్నారు.

మొదటి దైవం తల్లి

మనకు మొదటి దైవం తల్లి అని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. హైందవ సనాతన సంస్కృతిలో మహిళకు విశేషమైన స్థానం ఉందని చెప్పారు. టీటీడీ ఉద్యోగినులు తమ ఇంటిని చక్కబెట్టుకున్న విధంగానే సంస్థ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయడానికి కృషి చేయాలని కోరారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త అనంతలక్ష్మి మాట్లాడుతూ అంతరిక్షయానం నుంచి యుద్ధరంగం వరకు అన్నింటా మహిళలేనన్నారు. పద్మశ్రీ అవార్డు పొందిన తొలి మహిళా మృదంగ కళాకారిణి సుమతి రాంమోహన్‌రావు మాట్లాడుతూ ప్రతి మహిళ విజయం వెనుక ఒక పురుషుడు ఉంటాడనే నానుడిని నిజం చేస్తూ తన ఎదుగుదలకు తన భర్త పూర్తి సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ప్రముఖ గాత్ర కళాకారిణి డాక్టర్ ద్వారం లక్ష్మి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు మహిళలు పాటుపడాలని కోరారు.

విశేష సేవలు అందించిన వారికి సత్కారం

టీటీడీలోని వివిధ విభాగాల్లో విశేష సేవలు అందిస్తున్న 20 మంది మహిళా ఉద్యోగులకు పద్మావతి అవార్డులు ప్రదానం చేశారు. వీరిని శాలువతో సన్మానించి 5 గ్రాముల వెండి డాలర్, శ్రీపద్మావతి అమ్మవారి జ్ఞాపిక అందించారు. అలాగే ఏడాది కాలంలో ఉద్యోగ విరమణ చేయనున్న 57 మంది మహిళా ఉద్యోగులను సత్కరించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్, డీఎల్‌ఓ వీర్రారాజు, డీఈఓ భాస్కర్ రెడ్డి, సంక్షేమ విభాగం డెప్యూటీ ఈఓ స్నేహలత, బోర్డు సెల్ డెప్యూటీ ఈఓ ప్రశాంతి, మహిళా డెప్యూటీ ఈఓలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవం వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

అమ్మే దైవం

- కలెక్టర్ లక్ష్మీ శ
- మహిళాభివృద్ధికి ఏపీ సర్కార్ ఎన్నో సేవలు అందిస్తోంది
- కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- హాజరైన కలెక్టర్ జి.లక్ష్మీశ

తిరుపతి అర్బన్: 'అమ్మే దైవం...ఆమె కృషితోనే ఐఏఎస్ అయ్యాను. మహిళా మాతృమూర్తులు మీ పిల్లలను ఐఏఎస్ వైపు నడిపించండి.. మహిళ ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సేవలు ఎన్నో ఉన్నాయి.. ఆ పథకాలను సద్వినియోగం చేసుకోండి' అని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, పొదుపు సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే ఉన్నతమైన చదువులు చదువుకోవాలని సూచించారు. మహిళలకు ప్రభుత్వం రాజకీయంగా అందిస్తున్న సహకారాన్ని గుర్తుచేశారు. మహిళలు ఒత్తిడిని జయించడానికి యోగాపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమశాఖాధికారి జయలక్ష్మి, గురుకుల పాఠశాలల జిల్లా ఇన్‌చార్జి విజయభారతి, పట్టు పరిశ్రమలశాఖ జిల్లా అధికారి గీతారాణి, సీడీపీఓలు శాంతిదుర్గ, వాసంతి, పద్మజ తదితరులు మహిళా దినోత్సవం సందర్భంగా వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

152 మద్యం బాటిళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సెబ్ అధికారులు

గూడూరురూరల్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని కోర్టు సెంటర్ వద్ద ఉన్న ఓ కూల్ డ్రింక్ షాపులో గురువారం తనిఖీలు నిర్వహించి 152 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ ఎం.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు సెంటర్ వద్ద ఉన్న ఓ కూల్‌డ్రింక్ షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు గూడూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి జె.రమేష్ ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించామన్నారు. షాపు యజమాని ఎస్.కె.షఫీని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 152 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించామన్నారు. దాడుల్లో ఎస్ఈబీ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

- 4వ విడతలో 1,12,436 మందికి రూ.210.82 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్



చెక్కును ఆవిష్కరిస్తున్న జేసీ శుభం భన్సల్

తిరుపతి అర్బన్: మహిళా ఆర్థిక సాధికారతకు, పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూతను అంతా సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ అన్నారు. గురువారం రాష్ట్రప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు నాలుగు విడతల్లో మహిళల సమగ్ర అభివృద్ధి కోసం రూ.75,000 వేలు ఆర్థిక సహాయం అందించడానికి వైఎస్సార్ చేయూత పథకం అందిస్తోంది. గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం, పిసినికాడ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'వైఎస్సార్ చేయూత' 4వ విడత ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 26,98,931 మంది అక్కచెల్లెమ్మలకు రూ.5,060.49 కోట్ల మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లబ్ధిదారులకు కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ పేదల కోసం ఏర్పాటు చేసిన ఈ పథకాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2020 ఆగస్టు 12 ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకం ప్రారంభించి జిల్లాలో మొదటి విడతగా 95,171 మంది లబ్ధిదారులకు రూ.1,78.45 కోట్లు, 2021–22 ఆర్థిక సంవత్సరంలో రెండో విడతలో 99,267 మంది లబ్ధిదారులకు రూ.186.13 కోట్లు, 3వ విడతలో 1,11,408 మంది లబ్ధిదారులకు రూ.208.89 కోట్లు జమచేశారన్నారు. ప్రస్తుతం 4వ విడతలో భాగంగా జిల్లాలో అర్హులైన 1,12,436 మంది లబ్ధిదారులకు రూ.210.82 కోట్లు జమ చేశారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అందిస్తోందన్నారు. మహిళలు వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాలని సూచించారు. అనంతరం 'వైఎస్సార్ చేయూత' 4వ విడత రూ.210.82 మెగా చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, అడిషనల్ పీడీ ప్రభావతి రెడ్డి, డీపీఎంలు మాధవరెడ్డి, వనజాక్షి, వెంకటేష్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

- రూ.8 లక్షలు విలువ చేసే 144 గ్రాముల బంగారు స్వాధీనం


పట్టుబడిన దొంగను, బంగారాన్ని చూపిస్తున్న తిరుపతి డీఎస్పీ సురేందర్ రెడ్డి

తిరుపతి క్రైమ్: నగరంలో రాత్రి సమయంలో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న కరుడుగట్టిన ఓ దొంగను అరెస్ట్ చేసినట్లు తిరుపతి డీఎస్పీ సురేందర్ రెడ్డి తెలిపారు. గురువారం అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవకోనకు చెందిన వరదరాజులు మణి(30)ని కరకంబాడి రోడ్డులోని తిమ్మనాయుడుపాలెం బస్టాప్ వద్ద అలిపిరి సీఐ రామచంద్ర రెడ్డి తన బృందంతో కలిసి పక్కా ప్లాన్ ప్రకారం అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అతన్ని పోలీసులు తమదైన శైలిలో విచారించగా గతంలో అలిపిరి, ఎస్వీ యూనివర్సిటీ, తిరుచానూరు తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో 2019 నుంచి 2021 వరకు పది దొంగతనాలు చేసి జైలు శిక్ష కూడా అనుభవించినట్లు చెప్పారు. ప్రస్తుతం అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పాడన్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.8 లక్షలు విలువ చేసే 144 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితున్ని అరెస్ట్ చేయడంలో ఎస్ఐలు రాజశేఖర్, రామస్వామి, సిబ్బంది ఎంతగానో కృషి చేశారన్నారు.

టీడీపీ నేతల బరితెగింపు..!

- విధుల్లో ఉన్న సచివాలయ సిబ్బందిని బలవంతంగా బయటకు పంపి తాళాలు వేసిన వైనం
- చంద్రబాబు సొంత పంచాయతీ కందులవారిపల్లెలో టీడీపీ సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్ దౌర్జన్యం


కందులవారిపల్లి సచివాలయానికి తాళాలు వేస్తున్న టీడీపీ సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్, టీడీపీ నాయకులు

చంద్రగిరి(తిరుపతి జిల్లా): టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సొంత పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకులు బరితెగించారు. ప్రభుత్వ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై టీడీపీ సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్‌తో పాటు టీడీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని కందులవారిపల్లి పంచాయతీలో చోటు చేసుకుంది. చంద్రబాబు నాయుడు సొంత పంచాయతీ కందులవారిపల్లికి చెందిన సర్పంచ్ భర్త గిరి నాయుడుతో పాటు ఉప సర్పంచ్, మరికొందరు గురువారం పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఒక్కసారిగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై దౌర్జన్యానికి దిగి, ఇది తమ పంచాయతీ కార్యాలయం.. ఇక్కడ ఎవరూ ఉండకూడదంటూ బలవంతంగా విధుల్లో ఉన్న సిబ్బందిని బయటకు గెంటేశారు. ఆపై సచివాలయానికి తాళాలు వేశారు.

టీడీపీ నాయకులే ఇసుక రవాణా..

టీడీపీ సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్‌లు సచివాలయానికి తాళాలు వేయడంతో స్థానిక ప్రజలు అక్కడకు చేరుకున్నారు. ప్రభుత్వ కార్యాలయానికి తాళాలు వేయడం సబబు కాదని, ఇలాంటి చర్యలకు పాల్పడడం మంచి పద్ధతి కాదని హితువు పలికారు. పంచాయతీలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతోనే సచివాలయానికి తాళాలు వేసినట్లు వారు కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. దీంతో గ్రామస్తులు మాట్లాడుతూ పగలు, రాత్రి తేడా లేకుండా టీడీపీ నాయకులే ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, ఇసుకను తరలించే వారి వివరాలతో సహా టీడీపీ సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్‌కు వివరించారు. ఏదైనా ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి కానీ ఇలా విధుల్లో ఉన్నవారిపై దర్పం ప్రదర్శించడం ఏమిటని స్థానికులు ప్రశ్నించారు. సమాచారం అందుకున్న ఎంపీడీఓ స్థానిక సర్పంచ్ భర్తతో ఫోన్‌లో మాట్లాడడంతో కార్యాలయానికి వేసిన తాళాలను తీసినట్లు పంచాయతీ కార్యదర్శి మీనా తెలిపారు.

మహిళలే సంక్షేమ సారథులు


ఆసరా మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందిస్తున్న ఎంపీ గురుమూర్తి, సమన్వయకర్త రాజేష్

- ఎంపీ గురుమూర్తి

నాగలాపురం: సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరిటే అమలు చేసి, అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి అన్నారు. గురువారం నాగలాపురం టీఆర్ఆర్ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీ గురుమూర్తి మండలంలోని 808 సంఘాలకు 8509 మహిళలకు రూ.18,750 చొప్పున రూ.6.97 కోట్లను వైఎస్సార్ ఆసరా నాలుగో విడత మెగా చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం 99 శాతం హామీలను అమలు చేసిన ఏకైక నాయకుడు సీఎం జగన్మోహన్ రెడ్డి మాత్రమే అని తెలిపారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం..

అక్కచెల్లెమ్మలతో కలిసి తిరుపతి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ సమావేశానికి ముందు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, మండల అధ్యక్షుడు అపరంజిరాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, వైస్ ఎంపీపీ కుమారి, ఉప సర్పంచ్ సునీత, నాయకులు శ్యామ్, హరిబాబు, కులశేఖర్, దేశప్పన్, ఉదయ్ కుమార్, చిరంజీవి ఎల్.సురేష్, దేశన్, పాల్గొన్నారు.

బూత్ కన్వీనర్ల సమావేశం..

బూత్ కన్వీనర్ల్ నిర్వహణ జేసీఎస్ కన్వీనర్లదే పూర్తి బాధ్యత అని ఎంపీ గురుమూర్తి అన్నారు. వచ్చే ఎన్నికల్లో జేసీఎస్ కన్వీనర్లు అధిష్టానం ఆదేశాల మేరకు బూత్‌లలో పక్కా ప్రణాళికల ప్రకారం వ్యవహరించాలన్నారు.